# చదువుకున్న పాఠశాల దేవాలయంతో సమానం

**ఏఎస్ఆర్ కళాశాల, శాంతినగర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 1: విద్యాబుద్ధులు నేర్పి, ఇంతటి స్థాయిలో ఉంచిన మన పాఠశాల మనకు దేవాలయంతో సమానమని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని సీక్వెల్ రిసార్ట్స్‌లో జరిగిన ఏఎస్ఆర్ జూనియర్ కళాశాల, శాంతినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పూర్వ విద్యార్థి, మంత్రి అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. మనకు ఓనమాలు నేర్పిన పాఠశాలల అభివృద్ధి కోసం మనం తప్పక కృషి చేసి పాఠశాల, కళాశాల అభివృద్ధికి సహకారం అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన ఊరు- మన బడి పథకం ద్వారా శాంతి నగర్ పాఠశాలకు రూ.2.50 కోట్లు, రూ.50లక్షలు బల్లాల కోసం అందజేయడంతోపాటు పువ్వాడ ఫౌండేషన్ ద్వారా తోడ్పాటునందించామన్నారు. కళాశాలలో 700 మంది, స్కూల్‌లో 500 మంది, మొత్తం క్యాంపస్‌లో 1200మంది విద్యార్థులతో పూర్వ వైభవం వచ్చిందన్నారు. అనంతరం అప్పటి గురువులను, ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ పువ్వాడ కృష్ణ, టీచర్స్ బోస్, రాజు, కృష్ణకుమారి, దొడ్డ వినోద, నాగేంద్రమ్మ, నాగభూషణం, అశోక్‌బాబు, రామాచార్యులు, వీవీపీ రామారావు, వీవీఎల్ఎన్ శర్మ, కృష్ణయ్య, కృష్ణ, పూర్వ విద్యార్థి కార్పొరేటర్ కర్నాటి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు గిరి, అహ్మద్, కలిక్, రాంబాబు, బస్కినాయక్, భవాని ప్రసాద్, ఏఎస్ ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, గౌస్, పులిపాటి ప్రసాద్, ఆమంచి సురేశ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం, అక్టోబర్ 1: రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం రఘునాథపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఫీడర్ పరిధిలోని రఘునాథపాలెం, కేసీఆర్ కాలనీ, కేటీఆర్ కాలనీ, కోయచలక, రేగులచలక ప్రగతిమైదాన్, దారేడు, శివాయిగూడెం, పువ్వాడ ఉదయ్‌నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

## ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ ఎంపికలు



టీటీ పోటీల్లో గెలుపొందిన వారితో కోచ్

ఖమ్మం సిటీ, అక్టోబర్ 1: నగరంలోని పటేల్ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపికల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి దాదాపు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. జూనియర్ బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక జేసి ఈ నెల 16 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేశారు. పోటీలను ఖమ్మం నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, సీనియర్ క్రీడాకారులు ప్రారంభించారు. సోమవారం జరిగే పోటీల్లో జిల్లా తుది జట్లను ఎంపిక చేస్తామని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ సాంబమూర్తి తెలిపారు. పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఆనం రాజేశ్, పరిటాల చలపతి, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గవర్నర్ నిర్ణయం సరైంది కాదు



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఎరుకల సంఘం నాయకులు

ఖమ్మం సిటీ, అక్టోబర్ 1: గవర్నర్ కోటా ఎమ్మెల్సీలో ప్రభుత్వం చేసిన ఎమ్మెల్సీల సిఫార్సులను తిరస్కరిస్తూ గవర్నర్ తమిళిసై తీసుకున్న నిర్ణయం సరైంది కాదని తెలంగాణ ఎరుకల సంఘం (కుర్రు) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనూ ఏ పాలకులు, ప్రభుత్వాలు తమ ఎరుకల కులాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. సీఎం కేసీఆర్ తమను గుర్తించి ఎరుకల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణకు ఎమ్మెల్సీ పదవి కట్టబెడితే గవర్నర్ తిరస్కరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆమె నిర్ణయాన్ని మార్చుకుని ఎమ్మెల్సీల ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఇన్‌చార్జ్ కోనేటి నరసింహ, సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ రాయపుర వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వెలుగు ఉపేందర్, సంఘం నాయకులు పుట్టబంతి వెంకటరమణ, అంగిడి భిక్షం, అంగిడి ఉపేందర్, మాదగాని గాంధీ, వెలుగు శీను, పుట్టబంతి మంగమ్మ, నల్లగొండ వెంకన్న, అంగిడి రామకృష్ణ, అంగిడి స్వామి, అంగిడి మల్లయ్య, అంగిడి వెంకటేష్ పాల్గొన్నారు.

## ఆలిండియా యోగా ఛాంపియన్‌లో హేమంత్‌సాయి ప్రతిభ



ఆలిండియా యోగా ఛాంపియన్‌షిప్‌లో సిల్వర్‌మెడల్ తీసుకుంటున్న హేమంత్‌సాయి

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 1: జిజ్ఞాస ఉండాలే గానీ.. వయసుతో సంబంధమేమీ ఉండదు... తపన ఉంటే సాధించలేనిది ఏమి లేదని.. ఈ మాటలను అక్షరాలా నిజం చేస్తున్నాడు ఎనిమిదేళ్ల ఈ చిన్ని బుడతడు. ఖమ్మం నగరానికి చెందిన కృష్ణ-త్రివేణి దంపతుల కుమారు హేమంత్ సాయి ఆలిండియా యోగా నేషనల్ ఛాంపియన్ షిప్‌లో అద్భుత ప్రతిభ కనబర్చాడు.

**అత్యంత చిన్న వయస్సులో..**

యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 28 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు గోవాలో ఆలిండియా యోగా నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యంత చిన్న వయసులో ( 8 సంవత్సరాల) పాల్గొన్న విద్యార్థి హేమంత్‌సాయి. పోటీల్లో అందరూ అబ్బురపడేలా ఆసనాలు వేసి ఆలిండియా సిల్వర్ మెడల్ గెలుచుకొని అదరహో అనిపించాడు. నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చడంపై పలువురు ప్రశంసిస్తున్నారు.

# 'రేషన్' కమిషన్ పెంపు సంబురం

**రూ.70 నుంచి రూ.140కి పెంచిన ప్రభుత్వం**

**హర్షం వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు**

రఘునాథపాలెం, అక్టోబర్ 1: ప్రజా పంపిణీ వ్యవస్థలోని రేషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. క్వింటాకు రూ.70 ఉన్న కమీషన్‌ను రూ.140కి పెంచింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఇటీవల రేషన్ డీలర్ల సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి పలు డిమాండ్లకు హామీ ఇచ్చారు. ఈ మేరకు కమిషన్‌ను రూ.140కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇదీకాక డీలర్‌కు రూ.5లక్షల బీమా సౌకర్యం, ఏదేని కారణాలతో డీలర్ చనిపోతే అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయం, రేషన్ డీలర్‌కు సంబంధించిన ఆథరైజేషన్ రెన్యూవల్ పీరియడ్‌ను 2ఏళ్ల నుంచి 5సంవత్సరాలకు పెంచేలా నిర్ణయం తీసుకున్నారు. డీలర్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల విలువైన హెల్త్ కార్డును సైతం అందించనున్నది. జీవో జారీ చేయడంపై ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లోని రేషన్ డీలర్లు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్ కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### సంతోషంగా ఉంది..



ఎన్నో ఏళ్లుగా చాలీ చాలని కమిషన్‌తో కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఏళ్లుగా మా సమస్యలపై పోరాటం చేస్తున్నాం. గత ప్రభుత్వాలు మా డిమాండ్లపై ఎన్నడూ కనికరం చూపలేదు. కేసీఆర్ ప్రభుత్వం మా సమస్యలను పరిష్కరించింది. ఇప్పుడు కమిషన్ పెంచుతూ జీవో విడుదల చేయడం సంతోషంగా ఉంది.

-షేక్ జానీమియా, రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

### కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



తెలంగాణ ప్రభుత్వంలోనే డీలర్లకు న్యాయం జరిగింది. పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రేషన్ డీలర్ల సమస్యలను విన్నవించిన వెంటనే ప్రభుత్వం స్పందించి రెండో దఫాగా రూ.70 ఉన్న కమీషన్‌ను రూ.140పెంచడం సంతోషంగా ఉంది. కేసీఆర్ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

-బి. వెంకటమ్మ, రేషన్ డీలర్

# పీఆర్టీయూ ప్రభుత్వానికి మద్దతుగా ఉండాలి

**రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 1: రాష్ట్రంలో 80 వేల మంది సభ్యులతో అతిపెద్ద సంఘంగా ఉన్న పీఆర్టీయూ ప్రభుత్వానికి మద్దతుగా నిలబడాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఆదివారం సాయంత్రం నగరంలోని పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యాలయంలో ఇటీవల పదోన్నతి పొందిన 50 మందికి పైగా హెచ్ఎంల సన్మాన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మల్టీజోన్ వన్‌లో 1250 మందికి పైగా ఉపాధ్యాయుల పదోన్నతులు లభించడం గొప్ప విషయమన్నారు. పారదర్శకంగా ఆన్‌లైన్లో బదిలీలు నిర్వహించిన విషయాన్ని అందరూ అభినందించాలన్నారు. జిల్లాలో 52 మంది గెజిటెడ్ హెచ్ఎంలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు, రంగారావు, ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ,ఫణికుమార్, నారాయణరెడ్డి, రామ్మోహన్ రావు, వైవి, విజయ్ అమృతకుమార్, హరిత, జయమ్మ, శీను, సోమ్లా, రెబ్బా శ్రీను పాల్గొన్నారు.

## దసరాకు 5,265 ప్రత్యేక బస్సులు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 1: దసరా పండుగకు టీఎస్ ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. బతుకమ్మ, దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారి సౌకర్యార్థం 5265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. అక్టోబర్ 13 నుంచి 25వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రత్యేక బస్సుల్లో 536 సర్వీస్‌లకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. అక్టోబర్ 22న సద్దుల బతుకమ్మ, 23, 24న దసరాకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటే అవసరాన్ని బట్టి మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నది. రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు.

# పలుచోట్ల 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం



మంచుకొండలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 1: పౌరుల జీవన విధానంలో స్వచ్ఛత ఒక మౌళిక సూత్రంగా మారాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని జూబ్లీపుర ఎస్‌బీఐ కార్యాలయం ఆవరణలో బ్యాంకు ఉద్యోగులతో కలిసి ఆయన పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు.

రఘునాథపాలెం, అక్టోబర్ 1: ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల్లో స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచుకొండలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. గ్రామస్తులు, అధికారులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్పొరేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్1: 11వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఖమ్మం ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ఖమ్మం నగరంలో నిర్వహించారు. కల్నల్ నవీన్‌యాదవ్ ఆధ్వర్యంలో 500 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాల ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ వీరేంద్రచౌదరి, కృష్ణవేణి-త్రివేణి అధినేత వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బొమ్మ కళాశాల ఆధ్వర్యంలో కళాశాలలో స్వచ్ఛ కార్యక్రమంలో నిర్వహించారు. కళాశాల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి ఊదారు శ్రీధర్, డైరెక్టర్ మాధవి పాల్గొన్నారు.